ప్రజాశక్తి

మంగళవారం 20 డిసెంబర్ 2022 5

శ్రీ సత్యసాయి





సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆత్మహత్యకు యత్నించిన రైతు రామయ్యయాదవ్

మహాసభలకు...

'అనంత' ముస్తాబు

- నేటి నుంచి ఎపి మున్సిపల్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు
- మూడు రోజులపాటు సభలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహాసభలకు అనంతపురం నగరం ముస్తాబయ్యింది. మూడు రోజులపాటు ఇక్కడ జరిగే మహాసభకు అతిథ్యమివ్వనుంది. ఇందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను జిల్లా నాయకత్వం పూర్తి చేసింది. దాదాపు రెండు మాసాలుగా జిల్లా నాయకులు దీని కోసం కసరత్తు చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్ల అన్నింటిలోనూ సిఐటియు జెండాలతో అలంకరించారు. రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ప్లెక్సీలనూ ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే కార్మికులకు స్వాగతం పలుకుతూ స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు మంగళవారం నాడు భారీ బహిరంగ సభతో మహసభ ప్రారంభం కానుంది. కృష్ణా కళామందిరం నుంచి టవర్‌క్లాక్ సప్తగిరి సర్కిల్ మీదుగా నగర పాలక సంస్థ కార్యాలయం వరకు జరిగే ప్రదర్శనలో వేలాదిగా కార్మికులు పాల్గొనను న్నారు. తదనంతరం కెఎస్ఆర్ కళాశాల ఆవరణంలో బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ అధ్యక్షులు జి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబుళు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. రెండో రోజు 21వ తేదీ నుంచి నగరంలోని షిర్డీసాయి కళ్యామంటపంలో ప్రతినిధుల సభలు ప్రారంభం కానున్నాయి. ఈ రెండు రోజులు జిల్లాల వారీగా సమీక్ష జరుగనుంది. మూడేళ్ల కాలంలో ఆయా జిల్లాలో జరిగిన పోరాటాలను సమీక్షించుకోనున్నారు. తదనంతరం భవిష్యత్ కార్యచరణ నిర్ణయిస్తారు. ఆఖరి రోజు 22వ తేదీన కొత్త కార్యవర్గం ఎన్నిక జరుగనుంది.





మహాసభల ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్న ఎపి మున్సిపల్ వర్కర్స యూనియన్, సిఐటియు నాయకులు

ఏర్పాట్లు సిద్ధం

విశాఖలో జరిగిన 13వ మహాసభ నుంచి ఇప్పటి వరకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలను సమీక్షించనున్నారు. తదనంతరం రాబోయే మూడు సంవత్సరాల కాలంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యచరనను రూపొందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు మున్సిపల్ వర్కర్స్‌కు అనేక హామీలిచ్చి అమలు చేయలేదు. వీటిని సాధించుకోవడం కోసం ఏ రకమైన పోరాటాలను రూపొందాలన్నది ఈ మహాసభలో నిర్ణయించనుంది. మహాసభకు రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. నగరంలోని షిర్డీసాయి కళ్యాణమంటపంలో బుధవారం, గురువారం జరిగే ప్రతినిధుల సభలో అన్ని అంశాలపై లోతుగా చర్చిస్తారు. మహాసభ విజయవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగభూషణం తెలిపారు.

అధికారుల ఎదుటే

రైతు ఆత్మహత్యాయత్నం

- బలవంతంగా భూమిలాక్కోవద్దంటూ విన్నపం
- హైకోర్టు తీర్పును అమలు చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి -పెనుకొండ

పరిశ్రమ ఏర్పాటు పేరుతో అక్రమంగా తన భూమిని లాక్కోకుండా కోర్టు తీర్పు మేరకు తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు అధికారుల సాక్షిగా ప్రభుత్వ కార్యాలయంలో ఆత్మహత్యకు యత్నించాడు. పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. బాధిత రైతు కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం కావేటినాగేపల్లికి చెందిన రైతు రామయ్య యాదవ్‌కు 3.50 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఇందులో పంటలు సాగు చేసుకుంటూ ఆయన జీవనం సాగిస్తున్నాడు. ఈ ప్రాంతంలో నాసన్ కంపెనీ ఏర్పాటు పేరుతో న్యాయమైన పరిహారం కూడా ఇవ్వకుండానే ఈ రైతు భూమిని ప్రభుత్వం బలవంతంగా లాక్కొనే ప్రయత్నం చేసింది. దీంతో బాధిత రైతు హైకోర్టును ఆశ్రయించాడు. రైతుకు న్యాయం చేసిన తరువాతనే భూసేకరణ చేయాలని హైకోర్టు జిల్లా అధికారులను ఆదేశించింది. అయితే అధికారులు హైకోర్టు తీర్పును లెక్కజేయకుండా నెల రోజుల క్రితం అక్రమంగా జొరబడి రైతు పొలం చుట్టూ ఇనుప కంచె వేశారు. అక్కడున్న రైతు ఇంటినీ కూల్చివేశారు. ఈ సమస్యపై బాధిత రైతు కుటుంబం తమకు న్యాయం చేయాలని అని కోరుతూ గత కొన్ని నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో అర్జీ ఇచ్చేందుకు రైతు రామయ్య యాదవ్ వచ్చాడు. అధికారుల మాటలు విన్న అతనికి వారు న్యాయం చేయరని అన్పించింది. అప్పటికే తనతో తెచ్చుకున్న పురుగుల మందును అధికారులు, పోలీసుల ఎదుటే తాగేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పురుగుల మందు డబ్బాను పక్కకు లాగేసి రైతును చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రస్తుతం రైతుకు వైద్యుల పర్యవేణలో చికిత్సలు చేస్తున్నారు.

రైతుకు న్యాయం చేయాలని సిపిఎం ధర్నా

రైతు రామయ్య యాదవ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం మధ్యాహ్నం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పెనుకొండ, సోమందేపల్లి మండల కార్యదర్శులు రమేష్, రాజగోపాల్ మాట్లాడుతూ రైతుకు న్యాయం చేసిన తరువాతనే భూమిని తీసుకోవాలని హైకోర్టు చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. అధికారులు కోర్టు ధిక్కరణ చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. నాసిన్ నిర్మాణ పనులు అక్రమంగా, దౌర్జన్యంగా చేపడుతున్నారని రైతులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఉందన్నారు. సబ్ కలెక్టర్‌పై దీనిపై స్పందించి బాధిత రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్, వెంకటరాముడు, ఆవాజ్ కమిటీ నాయకులు చాంద్‌బాషా, మాబు, చేనేత కార్మిక సంఘం నాయకులు గంగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన టీచర్ల బదిలీల దరఖాస్తు గడువు

7500కు పైగా దరఖాస్తులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తు గడువు సోమవారం ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 7500 మందికి పైగా టీచర్లు దరఖాస్తులు చేసుకున్నారు. మంగళవారం నాడు ఎంఇఒలు, డివైఇఒలు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పరిశీలించి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపడం జరుగుతుంది. ఆ తర్వాత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పదికి పైగా టీంలు ఏర్పాటు చేసి ఆ దరఖాస్తులను పరిశీలించి సీనియార్టీ జాబితాను తయారు చేయనున్నారు. ఆ తర్వాత సీనియారిటీ జాబితాపై ఆన్లైన్ లోనే అభ్యంతరాలు స్వీకరించనున్నారు. తర్వాత జీవో ప్రకారంగానే బదిలీలను నిర్వహిస్తామని ఆర్జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకట కృష్ణారెడ్డి తెలిపారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-హిందూపురం

ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఎపి ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ పట్టణ మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు పట్టణంలోని సూగురు ఆంజినేయ స్వామి ఆలయం నుంచి సాయిరాం ఫంక్షన్ హాలు వరకు ఏర్పాటు చేసిన ఆటో ర్యాలీని సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెడ్పీ శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతు 15 సంవత్సరాలు దాటిన వాహానాలకు ఫిట్నెస్ పేరుతో వసూలు చేస్తున్న రూ. 4వేల చలానా వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో కోట్ల మంది ఉపాధి పొందుతున్న ట్రాన్స్ పోర్ట్ రంగంలో ఎంవి యాక్ట్ సవరణ చట్టం ద్వారా ప్రైవేటు, విదేశీ కంపెనీలైన ఓలా, ఊబర్ వంటి వాటికి అవకాశం కల్పించి ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారన్నారు. స్పేర్ పార్ట్స్ ధరలు, ఇన్సూరెన్స్ రేట్లు విపరీతంగా పెంచడంతో ఆటోలకు కిరాయిలు లేక కంతులు కట్టలేక వాహానాలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటువంటి పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌పోర్టు రంగాన్ని ఆదుకోవడంలో విఫలం చెందాయన్నారు. ఆటోల కొనుగోలుకు బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చెసి, ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్ ద్వారా లోన్లు మంజూరు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు వాహన మిత్ర పథకం వర్తింప జేయలన్నారు. ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేసే కార్మికులందరు సంఘటితమై పెనుగొండలో జరిగే 2వ జిల్లా మహాసభల్లో వీటన్నిటిపై చర్చించి, ఇప్పటివరకు జరిగిన ఉద్యమాలను సమీక్షించి, భవిష్యత్తు ఉద్యమాలకు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, అధ్యక్షులు జగదీష్, కోశాధికారి రామకష్ణ, పెద్ద ఎత్తున ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పట్టణ కమిటీ ఎన్నిక : హిందూపురం ఆటో యూనియన్ కమిటీని ఈసందర్భంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అత్తర్ బాబా, కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా అంజి, ఉపాధ్యక్షులుగా అతవుల్లా, షాదిక్, ఎజాజ్, మంజు, సహాయ కార్యదర్శులుగా సుధీర్, సలీం, నాగరాజు శ్రీరంగ రాజుపల్లి, నాగరాజు కోటిపి, కమిటీ సభ్యులుగా షాహిద్, బాబురెడ్డి, ఇర్ఫాన్, సంజీవప్ప, సురేష్, రవి, ఆదినారాయణప్ప, నవీన్ కుమార్ అంజన్ రావు, బాలు, అతిక్‌ను ఎన్నుకున్నారు.

పార్టీ నుంచి వినోద్‌కుమార్ బహిష్కరణ

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

సిపిఎం పట్టణ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శెట్టిపల్లి వినోద్ కుమార్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని ప్రజా సంఘాల నుంచి బహిష్కరించినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. పార్టీ స్థానిక కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వినోద్ కుమార్ పై వచ్చిన ఆరోపణలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం పార్టీ నుంచి అతన్ని బహిష్కరిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ గతంలో వినోద్ కుమార్ వైఖరిపై ఎన్నోసార్లు హెచ్చరించామన్నారు. మూడు నెలలు గడువు ఇచ్చి పద్ధతి మార్చుకోవాలని సూచించమన్నారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ఆయన వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందని భావించి పార్టీ నుంచి ప్రజా సంఘాల నుంచి బహిష్కరించినట్లు చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్ఎస్ఎస్ క్యాంప్

రొద్దం : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆసుపత్రి ప్రాంగణంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను ఎన్ఎస్-ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో తొలగించారు. దీంతో ఆసుపత్రి వైద్యాధికారి జగదీష్ బాబు విద్యార్థులను, కళాశాల సిబ్బందిని, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం కళాశాల సిబ్బంది, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ప్రసాద్‌రావు, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు

రహదారి కోసం ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

కబ్జాకు గురైన హిందూపురం రూరల్ మండలం కొటిపి పంచాయతీ వీరంపల్లి రహదారిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ముందు ఆందోళకు దిగారు. రహదారిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి అధికారులు పట్టా ఇచ్చారని విమర్శించారు. అధికారుల స్పందించి ఇచ్చిన పట్టాను రద్దు చేసి గ్రామానికి ప్రధాన రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిని ఇచ్చారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ పరిశీలన చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అండర్ - 14 జిల్లా జట్టుకు కదిరి క్రీడాకారులు

ప్రజాశక్తి కదిరి టౌన్

అండర్ - 14 జిల్లా క్రికెట్ జట్టుకు కదిరి క్రీడాకారులు ఎంపికైనట్లు క్రికెట్ కోచ్ నజీర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరిలో నిర్వహిస్తున్న దక్షిణ మండల అంతర్ జిల్లాల అండర్ 14 క్రికెట్ క్రికెట్ పోటీలలో పాల్గొంటున్న అనంతపురం జిల్లా జట్టుకు కదిరి క్రీడాకారులు తరుణ్ కుమార్, దేదీప్ ఎంపికయ్యారన్నారు. అంతర్ జిల్లాల పోటీలలో కదిరి క్రీడాకారులు రాణించాలని క్రికెట్ సంఘం సభ్యులు,సీనియర్ క్రీడాకారులు, పాఠశాల యాజమాన్యం ఆకాక్షించారు.

విద్యుత్‌ను ఆదా చేద్దాం..

ధర్మవరం టౌన్ : విద్యుత్‌ను ప్రతి వినియోగదారుడు పొదువుగా వాడుకోవాలని అనంతపురం రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపీ కోరారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఎడి రామక్రిష్ణ, ధర్మవరం 12 డివిజన్ ఎఇలు నాగభూషణం, కొండారెడ్డి, ధర్మవరం రూరల్ ఎఇ జానకిరామయ్య, కనగానపల్లి, రామగిరి ఎఇలు మదనమోహన్, వెంకటేష్, ధర్మవరం జెఎఇలు నారాయణస్వామి, శంకర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ట్రాన్స్‌కో ఉద్యోగులు

వైసిపి పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం : టిడిపి





కదిరి, మడకశిర మండలాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

తాడిమర్రి : వైసిపి పాలనలో అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని టిడిపి నాయకులు విమర్శించారు. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాము, నాయకులు హర్షవర్ధన్ గుప్త, కొంక సాంబశివ, పాపానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో కనుచూపుమేరలో అభివృద్ధి కనిపించలేదని పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ అన్నారు. ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి అనే కార్యక్రమాన్నిసోమవారం పట్టణంలోని 17వ వార్డు లో కౌన్సిలర్ సావిత్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాషా, మహబూబ్ పీర్, చలపతి, ఇలియాస్, సూరి తదితరులు పాల్గొన్నారు.

అమరా పురం : వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి నాయకులు విమర్శించారు. మండల పరిధిలో పులి కుంట గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహ, శివ రుద్రప్ప, కృష్ణమూర్తి, జయరాం, నాగరాజు, రవికుమార్‌తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని చీకటిమానిపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ తొట్లీ రెడ్డి శేఖర్ రెడ్డి, నాయకులు సోంపాల్యం నాగభూషణ, కోటిరెడ్డి మల్‌రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, మల్లికార్జున, రవి, ఉత్తన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు తీరని నష్టం జరుగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక నగర పంచాయతీ పరిధిలోని వడ్రపాలెంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భక్తర్, మనోహర్, నరసింహరాజు, ఉమాశంకర్, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.



గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ లోగో విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ బసంత్‌కుమర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి సమస్యలపై ప్రజల ఇచ్చిన 128 అర్జీలను ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ భాగ్యరేఖతో కలిసి స్వీకరించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని మండలాల అధికారులతో మాట్లాడారు. స్పందనలో వచ్చిన అర్జీలను అలసత్వం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలైన వాహన మిత్ర, నేతన్న నేస్తం, జగనన్న విద్యాదీవెన తదితర పథకాలకు సంబంధించి త్వరగతిన చర్యలు చేపట్టాలన్నారు. వీటిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. గడపగడపకూ కార్యక్రమానికి చెందిన 163 పనులు ఇంకా గ్రౌండ్ కాలేదని వచ్చే గురువారం నాటికి పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. గహ నిర్మాణంలో ఈనెల ఆఖరుకు మంజూరైన ప్రతి ఒక్క ఇల్లూ గ్రౌండింగ్ కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, భూగర్భ గనుల శాఖ అధికారి కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ లోగో విడుదల

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించాలన్న లక్ష్యంతో వచ్చే ఏడాది 3,4 తేదీల్లో విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్‌కు సంబంధించిన లోగోను కలెక్టర్ బసంత్‌కుమార్ ఆవిష్కరించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో కలిసిలోగోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, ఏపీఐఐసీ అధికారి మురళి, ఎల్‌డిఎం సాయినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం పెంచాలి

ప్రజాశక్తి మడకశిర

కొడి కొండ చెక్ పోస్ట్ నుండి శిరా వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి వల్ల నష్టపోతున్న రైతుల భూములకు ధరలను పెంచి నష్టపరిహారం ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఆనంద్‌కుమార్‌కు సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిర, హరేసముద్రం , బుల్లసముద్రం రెవెన్యూ గ్రామాలకు చెందిన 26 మంది రైతులకు చెందిన వ్యవసాయ సాగు భూములను రహదారి ఏర్పాటు కోసం భూసేకరణ కింద కోల్పోతున్నామన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు బద్రీష్, సుబ్బారెడ్డి, నరసప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమస్య వింటున్న తహశీల్దార్

ప్రజాశక్తి
www.prajasakti.com

అనవసర ఆరోపణలు తగదు

బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత శివశంకర్



విలేకర్లతో మాట్లాడుతున్న బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్

కదిరి టౌన్ : విద్యార్థుల జీవితాలను మెరుగుపరచడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా తమ విద్యాసంస్థలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సోమవారం విద్యాసంస్థలోని తనకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివశంకర్ మాట్లాడారు. మణికుమార్ నాయక్ అనే విద్యార్థి తమ కళాశాలలో 20 20- 21 సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించారని, కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందే సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించ లేదని అన్నారు. అమ్మఒడి పథకం కింద ప్రభుత్వం అందజేసిన మొత్తాన్ని పరిగణలోకి తీసుకుని మొదటి సంవత్సరం రూ. 17,500, రెండవ సంవత్సరం రూ. 17,500 ఫీజు చెల్లించమని విద్యార్థికి తెలిపామన్నారు. అయితే ఆ విద్యార్థి మొదటి సంవత్సరం ఫీజు చెల్లించలేదన్నారు. కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాల వలన ఫీజు చెల్లించలేదని రెండవ సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని తెలపడంతో మానవతా దృక్పథంతో అంగీకరించామన్నారు. మొదటి సంవత్సరంలో అమ్మఒడికి సంబంధించి తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బులు తీసుకున్నారని చెప్పారు. ఆ విద్యార్థి రెండో సంవత్సరం ఫీజు కూడా చెల్లించలేదన్నారు. హాల్ టికెట్ను ఇంటర్నెట్లో డౌన్లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరయ్యాడని ఇంటర్ పాస్ అయిన తర్వాత మార్కుల జాబితా కోసం కళాశాలకు వచ్చాడని చెప్పారు. ఆ సమయంలో విద్యార్థి తండ్రితో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ విద్యార్థి సంఘం నాయకులు తమ ప్రిన్సిపల్ను అసభ్య పదజాలంతో దూషించారన్నారు. దీంతో ఆయన తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారన్నారు. పేద విద్యార్థి అనే ఉద్దేశంతో రవాణా ఫీజులు కూడా మాఫీ చేయడం జరిగిందన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యాదానం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇంతమంచి పేరు ఉన్న తమ విద్యాసంస్థ పట్ల అనవసర ఆరోపణలు చేయడం తీవ్ర బాధాకరమైన విషయమన్నారు. విద్యార్థిని కులంతో దూషించారని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కులాలు, మతాలను గౌరవించడం గురుతర బాధ్యతని స్పష్టం చేశారు. అనవసర ఆరోపణలు చేస్తూ తమ కళాశాలపై ఫిర్యాదులు చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. అనవసర ఆరోపణలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. అధికారుల విచారణలో వాస్తవ పరిస్థితులను వెల్లడిస్తామన్నారు. అవాస్తవాలను నమ్మొద్దని తమ విద్యాసంస్థ ఎదుగుదలకు కారణమైన ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యేలు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నల్లచెరువు : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి అన్నారు. డిసెంబర్ 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని గీతా మందిరం ఆవరణంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వైసిపి శ్రేణులు మూడు రోజులపాటు సంబరాలు జరుపుకుంటున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో కూడా క్రీడా సంబరాలు ప్రారంభమవుతున్నాయన్నారు. అందులో భాగంగా కదిరి నియోజకవర్గంలో నల్లచెరువు మండలంలో క్రికెట్ పోటీలను ప్రారంభించినట్లు చెప్పారు. మంగళవారం కదిరి మున్సిపల్ పరిధిలోని జగనన్న లేఅవుట్లలో పెద్ద ఎత్తున చెట్లను నాటే కార్యక్రమం చేపడతామన్నారు. డిసెంబర్ 21న రక్తదానంతో పలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, వైస్ ఎంపిపి నారాయణస్వామి, ఎంపిటిసిలు భాస్కర్ రెడ్డి, రఫీ, సర్పంచులు శ్రీనాథ్ రెడ్డి, యూసఫ్, సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచి డీకే బాబు, కో ఆప్షన్ బట్టి హైదరవలి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శంకర, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగభూషణ, సింగల్ విండో అధ్యక్షులు జయచంద్ర రెడ్డి, డైరెక్టర్లు ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : కీడలు దైనందిన జీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదినం పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ భాస్కర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడండి

కదిరి టౌన్ : ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 21 న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా చేపడుతున్న రక్తదానానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. జగన్ 50వ పుట్టినరోజు సందర్భంగా వైసిపి శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టాయన్నారు. అందులో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్తదానం చేయడంతో పాటు ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి రక్తం అవసరమైనా స్వచ్ఛందంగా దానం చేసేందుకు వీలుగా దాతల వివరాలు ప్రత్యేకంగా రూపొందించిన వెబ్సైట్లో నమోదు చేస్తున్నామని చెప్పారు. అత్యవసర సమయంలో రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరు తమ పేరును స్వచ్ఛందంగా రిజిస్టర్ చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వి.రాఘవేంద్ర, నాయకులు ఆసీఫ్, విష్ణు, శ్రీకాంత్, ముబారక్, నరసింహనాయుడు, మహేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఇతర ఫీజులతో ముడిపెట్టొద్దు

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటర్ విద్యార్థులకు కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థుల నుంచి పరీక్షా ఫీజులను తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కళాశాల వసతిగృహం వద్ద ఆయన మాట్లాడుతు పట్టణంలో పూర్తి స్థాయిలో ప్రభుత్వ కళాశాలలు లేక పోవడంతో వేలాది మంది విద్యార్థులు ప్రవేటు, కార్పోరేట్ కళాశాలల్లో విద్యార్థులు చేరుతున్నారు. దీనిని ఆసర చేసుకుని కళాశాల యాజమాన్యాలు విపరీతంగా ఫీజులను పెంచడమే కాకుండా ఫీజులను పరీక్షా ఫీజులను అడ్డుపెట్టుకుని చెల్లించాలని వేధించడం తగదన్నారు. ఇలాంటి కళాశాలలపై విద్యాశాఖ అధికారులు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షకుమార్, భగత్, అభి, మహేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కనగాన పల్లి : మండల పరిధిలోని ముత్తువ కుంట్ల కు చెందిన ఈడిగ సురేష్ (26) రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సురేష్ గత వారం రామగిరి మండలం నాగలమడక వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదుపుతప్పి వద్ద డివైడర్కు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్సలో భాగంగా కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య మమత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూ వివాదంపై ఘర్షణ

గోరంట్ల : భూ వివాదంపై మండలంలోని దేవుళ్ళ చెరువు గ్రామంలో ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు రామంజి పునుగులపల్లి చెందిన ఆంజనేయులుకు ఇదే గ్రామానికి చెందిన వైసిపి వర్గీయులు మైలారం, రాము మధ్య గత కొంతకాలంగా భూ వివాదం నెలకొంది. ఈ వివాదంపై కోర్టులో విచారణ జరుగుతుంది. అయితే సోమవారం సాయంత్రం టిడిపి వర్గీయులైన రామాంజి, ఆంజనేయులు ద్విచక్ర వాహనంలో గోరంట్ల నుండి స్వగ్రామానికి వెళుతుండగా వైసీపీ వర్గీయులు మైలారం రాము దారి కాచి రాళ్ళు, రాడ్లతో దాడి చేసినట్లు బాధితులు రామాంజి ఆంజనేయులు తెలిపారు. గాయపడిన వీరిద్దరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో మెకానిక్ మృతి

కొత్తచెరువు : కొత్తచెరువులోని టీవీ మెకానిక్ గుండెపోటుతో మృతిచెందాడు. దర్గా రూములో టీవీ మెకానిక్ షాప్ నిర్వహిస్తున్న దాదా పీర్ (40) సోమవారం గుండెపోటుకు గురయ్యాడు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే దాదాపీర్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దాదాపీర్ మృతితో అతని కుటుంబం వీధినపడింది, మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాదిరి ప్రశ్నాపత్రాలు విడుదల

మడకశిర : పదవ తరగతి మోడల్ పరీక్ష పత్రాలను యుటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేశారు . విద్యాశాఖ అధికారి కార్యాలయంలో యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివన్ మాలింగప్ప, మూడ్ల గిరియప్ప ఆధ్వర్యంలో మడకశిర మండల విద్యాశాఖ అధికారి ప్రకాష్ భాస్కర్ , సత్యసాయి జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న చేతుల మీదుగా మోడల్ టెస్టు పేపర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ భాస్కర్ మాట్లాడుతూ సి, డి గ్రేడ్ విద్యార్థులకు ఈ మోడల్ టెస్టు నిర్వహణ ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. నరసింహప్ప, జోగప్ప, కార్యదర్శి నంజప్ప, మహంతేష్, సురేష్, సూర్యప్రకాష్, రాజేంద్ర, వెంకట రాముడు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

'గోనుగుంట్ల'ను విమర్శిస్తే సహించం

ధర్మవరం టౌన్ : తమ నాయకుడు గోనుగుంట్లను విమర్శిస్తే సహించేది లేదని ఆయనను విమర్శించే అర్హత కేతిరెడ్డికి లేదని బిజెపి నాయకులు విమర్శించారు. మాజీఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వ్యక్తిగత కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు చిగిచెర్ల అరవిందరెడ్డి, గొట్లూరుచంద్ర. తుంపర్తి పరమేశు మాట్లాడారు. ఏ. పార్టీ అయిన నియోజకవర్గ సమన్వయ సమావేశాలు ఏర్పాటుచేసేది ఆపార్టీ కార్యకర్తల సమస్యలు, లోపాలు,ఉంటే చర్చిండానికే అని అన్నారు. అయితే వైసిపి నాయకులు కేవలం ప్రతిపక్ష పార్టీలను టార్గెట్ చేసుకుని విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలకు సూర్యనారాయణరెడ్డి, రాప్తాటి రాము, బోడగలగిరి, డిజైనర్ రాజు, ఓలేటిమురళి, నబీరసూల్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

అమరాపురం : మండల పరిధిలోని శివరం గ్రామంలో 20 రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచి పరిష్కరించారు. చెరువు నీటిలో ఉన్న బోరుమోటరును మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి కంటిచూపు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గుడ్డిబావివీధికి చెందిన చింతకాయలు పార్వతమ్మ (70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. దీంతో ఆమెకుటుంబ సభ్యులకు నేత్రదానంపై యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహనం కల్పించారు. వారి సహకారంతో జిల్లా అంధత్వ నివారణా సంస్థ టెక్నీషియన్ శ్రీకాంత్ పార్వతమ్మ నేత్రాలను సేకరించారు.

నాడు-నేడు పనులు వేగవంతం

ధర్మవరం టౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో జరిగే నాడు – నేడు. పనులను వేగవంతం జరిగేలా చూడాలని జిల్లా ఒకేషనల్ ఇన్స్పెక్షన్ అధికారి (డివిఐఒ) రఘునాథరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం కళాశాలలో నాడు – నేడు కింద జరుగుతున్న తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగంగా జరిగేలా చూడాలని కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డికి సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఈ ఏడాది పరీక్షలలో మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నాక్యాంటీన్ ప్రారంభం

ధర్మవరం టౌన్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమవారం అన్నక్యాంటిన్ ద్వారా పేదలకు టీడీపీ నాయకులు అన్నదానం చేశారు. ఈ సందర్భం వారు మాట్లాడుతూ. రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి హాయంలో లక్షలాది మంది పేదల కడుపును అన్నాక్యాంటిన్లు నింపాయన్నారు. ప్రస్తుతం దాతల సహకారంతో ప్రతిసోమవారం అన్నక్యాంటిన్ ద్వారా పేదలకు ఉచితంగా బోజనం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంగాడ్, పరిశేసుధాకర్, బీమినేని ప్రసాద్ నాయుడు, మారుతిస్వామి, రామకృష్ణ, బీరే శ్రీనివాసులు, సీబీఎన్ రామక్రిష్ణ, ఐటీడీపీ పట్టణ అధ్యక్షుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలో ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన కంది పంటకు సంబందించి అధికారులు సోమవారం పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. మండలంలోని సంగాల, ఈదుల ముష్టూరు గ్రామల్లో పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. ధర్మవరం ఎడిఎ క్రిష్టయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విఎఎ సునీత, విహెచ్ఎ సత్యనారాయణ, సర్పంచులు కంచనగారి రాజశేఖర్ రెడ్డి, చెడిపోతుల గోపాల్, ఎఒ ఓబిరెడ్డి, ఎఇఒ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుండీల ఏర్పాటు

నల్లచెరువు : మండల కేంద్రంలోని వివిధ వీధులలో సర్పంచి పంచరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు వసుంధర, ఆనంద్ ఆధ్వర్యంలో చెత్తకుండీలను సోమవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పాటు చేసిన కుండీలలో మాత్రమే చెత్తను వేయాలని ప్రజలను కోరారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పంచరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు వసుంధర, ఆనంద్, ఎంపీటీసీ లక్ష్మీదేవి, వార్డ్మెంబర్ భారతి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి

గోరంట్ల : ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ఎంఆర్పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రంగనాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైకిల్ నరసింహులు, వానవోలు నారాయణ, గంగన్న, బూదిలి లక్ష్మీపతి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు నిరసన

పుట్టపర్తి అర్బన్: ఎస్సీ ఎస్టీ నిధులు ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని, పక్కదారి మళ్లించకుండా వారి అవసరాలకే కేటాయించాలని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ముందు దళితులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ బసంత్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి. శ్రీనివాసులు, పి. శ్రీరాములు, రామాంజనేయులు, రాజశేఖర్, యశోద, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారించాలని వినతి

ప్రజాశక్తి- చిలమత్తూరు

కోడూరు పంచాయతీ వ్యాప్తంగా 25 కు పైగా ఉన్న గ్రానైట్ పరిశ్రమలు నుండి వచ్చే వ్యర్థాలను ఇష్టానుసారం రోడ్లు, పొలాలలో వేస్తుండటంతో నేల, నీరు కాలుష్యం అవుతున్నాయని గ్రానైట్ పరిశ్రమలపై చర్యలు తీసుకోని కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు స్థానిక డిజిటల్ అసిస్టెంట్ నాగార్జునకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం స్థానిక నాయకులు రామచంద్ర, రమేష్, నరసింహులు మాట్లాడుతూ కోడూరు గ్రామ పంచాయతీలోని గ్రానైట్ పరిశ్రమలు నుండి వచ్చే వ్యర్థాల వల్ల పక్కన ఉన్న రైతుల భూములతో పాటు హబ్ భూములు, చెరువులు, డ్యామ్లు కలుషితం అవుతున్నాయన్నారు. దీంతో గాలి, భూమి, నీరు కలుషితం అవ్వడంతో పాటు పశువులు అనారోగ్య రుగ్మతలకు గురి అవుతున్నాయన్నారు. ఈ గ్రానైట్ యాజమాన్యం చిత్రవతి, కుషావతి నదులలో సైతం వాటి వ్యర్థాలను కలుపుతున్నాయని విమర్శించారు.కోడూరు సమీపంలోని నీటి నిల్వ చేసే డ్యామ్ పూర్తిగా వీటి వ్యర్థాలతో నిండిపోయిందన్నారు. రాత్రి వేలల్లో ఎక్కడపడితే అక్కడ రోడ్డుపక్కన ఈ వ్యర్థాలను వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి కాలుష్యం నుండి సంరక్షించాలని అన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఇంటర్షిప్ పేరుతో డిగ్రీ కళాశాలల్లో వసూళ్ల పర్వం : ఎస్ఎఫ్ఐ

మడకశిర : ఇంటర్ షిప్ పేరుతో డిగ్రీ కళాశాలలో విద్యార్థుల నుండి అనధికారంగా వసూళ్ల పర్వానికి తెరలేపాలని ఇది వెంటనే ఆపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఆనంద్ కుమార్కు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ 2020 సంవత్సరం నుండి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానంలో భాగంగా డిగ్రీ విద్యార్థులు 5 లేదా 6 సెమిస్టర్లో ఆరు నెలలు పాటు ఇంటర్నేషిప్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులు చదువుతున్న కోర్సులకు సంబంధించి వివిధ పరిశ్రమలలో కొన్ని నెలల పాటు తర్ఫీదు పొందిన అనంతరం ఆ కంపెనీ వారు ఇచ్చే ధ్రువీకరణ పత్రాన్ని విద్యార్థులు పొందాల్సిఉంటుందన్నారు. ఈ ఇంటర్న్ షిప్ లో పరిశ్రమల వారు విద్యార్థుల కు కొంత ప్రోత్రాహకంగా ఫెలోషిప్ పేరుతో నగదును చెల్లిస్తార చెప్పారు. ఈ ఇంటర్నెట్ షిప్ భవిష్యత్తులో డిగ్రీ అనంతరం వారి జీవనోపాధి కోసం ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల సంక్షేమ దృష్ట్యా ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెడితే కొన్ని డిగ్రీ కళాశాలలు విద్యార్థుల నుండి వేలాది రూపాయలు వసూలు చేసుకుని పరిశ్రమలో తర్ఫీదు పొందినట్లుగా ధ్రువీకరణ పత్రం ఇప్పిస్తామని నమ్మబలుకుతున్నారని ఆరోపించారు. ఈ విధానం కళాశాలల వారు మానుకొనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, హేమంత్, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పరిగిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



హిందూపురంలో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ

పరిగి : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. మండలంలోని కోడిగినహళ్లిలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డిపల్లి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలుపై ఆయన కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణకు ప్రతి సచివాలయ పరిధిలో కన్వీనర్లు గృహ సారథుల ఎంపికపై నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శ్రీరామప్ప, శ్రీరాములు, నారాయణప్ప, ప్రభాకర్, గోవిందప్ప, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వ పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని హేమావతిలో సర్పంచి తిప్పేస్వామి అధ్యక్షతన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు నళిని రంగేగౌడ్, వీరక్యాతప్ప, గగన తనువీర్ గౌడ్తో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

హిందూపురం : ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూసేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నామని ఎమ్మెల్సీ ఇక్బాల్ పేర్కొన్నారు. సోమవారం పురపాలక సంఘ పరిధిలో 34వ వార్డు మేళాపురం తదితర ప్రాంతాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు మున్సిపల్ చైర్పర్సన్ ఇంద్రజ, వార్డు కౌన్సిలర్ నాగమణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

భూ రీసర్వేపై అధికారులతో సమీక్ష

పరిగి : మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న భూహక్కు రీసర్వేపై సోమవారం కొడిగెనహళ్లి సచివాలయం 3 లో సోమవారం సమీక్ష నిర్వహించారు. తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీవో ఆధ్వర్యంలో సచివాలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూముల రీసర్వే ప్రక్రియను పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు.కొడిగెనహళ్లిలో ప్రతి భూమిని రికార్డుల ఆధారంగా లబ్ధిదారులకు అందుబాటులో ఉండే రీసర్వే పక్రియను పూర్తి చేయాలని సచివాలయ అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ భక్తవత్సలంతో పాటు పలువురు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

ధర్మవరం టౌన్ : ఇటీవల కాలంలో పట్టణంలో చేనేత కార్మికులు అప్పులబాదతో ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు ఎం కటస్వామి, వెంకటనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో తిప్పేనాయక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, శ్రీధర్, సురేశ్, నరసింహులు , వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బుక్కపట్నం : మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి గ్రామ సమీపంలో చౌడేశ్వరి దేవి ఆలయం నిర్మాణానికి, జగనన్న కాలనీ నిర్మాణానికి వైసిపి నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు కానున్న జగనన్న కాలనీలో చౌడేశ్వరి దేవి ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రూప, ఎమ్మెల్యే సోదరుడు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, నాయకులు నాగమల్లి రెడ్డి , కేశవ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

లేపాక్షి : మండల కేంద్రంలోని పాతలేపాక్షి, వీవర్స్కాలనీవాసులు తమ కాలనీలకు అనువుగా శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ మేరకు వారు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిన్న ఓబన్న, శివప్ప, నారాయణ రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్ అందిస్తున్న డాక్టర్ నాగసింధు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రముఖ వైద్యురాలు నాగసింధు, ఆడిటర్ స్రావ్య చంద్రిక కోరారు. సోమవారం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్నా ఎల్ఆర్జి విద్యాలయంలో ఫౌండర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల హెచ్ఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా పాఠశాల సెక్రేటరి బాలసుందరం, ఎఒ సంజీవరెడ్డిలు పాల్గోన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నైతిక విలువలతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తును బంగారు మయం చేస్తుందన్నారు. అనంతరం ప్రతిబా కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు మెరిట్ స్కాలర్షిప్లను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.
